# చదవని పుస్తకంతో ఆలోచన మారింది

**స్కూల్ నుంచి రాగానే పుస్తకాల సంచి విసిరికొట్టి గ్రౌండ్‌లో పరుగెత్తే వారు, వీడియో, సెల్‌లో గేమ్స్‌తో, టీవీతో కాలక్షేపం చేసే పిల్లలే కదూ మీరు. కానీ ఈ బుడతడు మాత్రం స్వయంగా ఒక కంపెనీనే నడుపుతున్నాడు. ఆ కుర్రాడు ఏం చేస్తున్నాడో తెలుసుకుందామా!**



అర్థవ్ పాటిల్.. చదివేది 9వ తరగతి. ఆ క్లాస్ పిల్లలు బేసిక్‌గా ఒకరకమైన భయంతో ఉంటారు. ఎందుకంటే, తర్వాత టెన్త్, మార్కులు.. ర్యాంకులు.. ఏదీ తెలియని టెన్షన్ పట్టుకుంటుంది. కానీ అర్థవ్ పాటిల్ భయపడే బాపతుకాదు. చదువు మినహాయిస్తే.. ఆటలు గీటలు పక్కనపెట్టి ఏకంగా కంపెనీయే పెట్టాడు. దాని పేరు 'ఐ హావ్ రీడ్ ద బుక్.కామ్'.

పాటిల్ ఒకటో తరగతి నుంచే పుస్తకాల పురుగు. అయితే రెండో క్లాసులో అడుగుపెట్టిన తర్వాత చదివిందే చదివి బోర్ కొట్టేసింది పిల్లోడికి. ఇంకా ఏదో చదవాలనిపించేది. పుస్తకాలు చదవడంలో పాటిల్ జిజ్ఞాసను అర్థం చేసుకున్న తండ్రి చిన్న పిల్లల పుస్తకాలు కొనుక్కొచ్చి ఇచ్చాడు. వాటిని చదువుతూ.. తెలియని పదాలకు అర్థాల కోసం డిక్షనరీలను కూడా ఉపయోగించేవాడు. అలా పుస్తకాలు చదివే అలవాటు అంతకంతకూ పెరిగింది. కనీసం రోజుకు ఒక్క పుస్తకం అయినా కంప్లీట్ చేయకపోతే పాటిల్ మనసు మనసులో ఉండేది కాదు. తండ్రి కూడా కొడుకు అభిరుచిని అర్థం చేసుకుని నాలెడ్జిని పెంచే పుస్తకాలను తెచ్చి ఇచ్చేవారు. చదివిన పుస్తకం తాలూకు దృక్కోణం, వాటిని సమీక్షించిన వారు ఏ యాంగిల్‌లో చూశారు? ఏ విధంగా అర్థమయింది? ఇలాంటివాటన్నింటినీ తనకు తాను ఎనలైజ్ చేసుకునేవాడు.

పుస్తకాలతో ఎంత విజ్ఞానాన్ని పొందినా.. చదవకుండానే ఓ పుస్తకం పాటిల్‌ని కొత్తదారిలో నడిచేలా చేసింది. సమ్మర్ సెలవుల్లో ఓ రోజు తను చదవటోయే పుస్తకంలో ఏముందో రివ్యూ తెలుసుకోవాలనుకున్నాడు. ఇదే విషయాన్ని తండ్రికి చెప్పాడు. అందుకు నాన్న ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేయమని సలహా ఇచ్చాడు. అయితే ఎంతసేపు వెతికినా తనకి కావాల్సిన పుస్తకానికి సంబంధించి రివ్యూ దొరకలేదు. ఒకటి అరా దొరికినా.. అది అర్థం కానీ భాషలో ఉంది. అప్పుడే అతనికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఈ పుస్తకం రివ్యూ నేనే ఎందుకు రాయకూడదు? అని ఆలోచించి అదే విషయాన్ని తండ్రికి చెప్పాడు. కేవలం చిన్నారులు, టీనేజర్లకు అర్థమయ్యేలా పుస్తకాల రివ్యూలను నేనే రాస్తానని ప్రతిపాదించాడు. ఎప్పటి నుంచో పుస్తకాలు చదువుతున్నాను కాబట్టి చిన్న పిల్లలకు ఆసక్తి కలిగించే పుస్తకాలేమిటో వారి అభిరుచులేమిటో తెలుసు కాబట్టి వారికి ఇష్టమైనట్లు అర్థమయ్యేటట్లు రాస్తానని ఒప్పించాడు. నాన్న మొదట ఆశ్చర్యపోయాడు. పిల్లాడి ఆలోచనను, ఆసక్తిని గమనించి నిరుత్సాహపరచకుండా సరేనన్నాడు.

తండ్రి నుంచి ప్రోత్సాహం లభించిన వెంటనే వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయలేదు పాటిల్. ఇంటర్నెట్‌లో శోధించి 12వేల స్కూళ్ల డేటా సేకరించాడు. అయితే ఆ తర్వాత స్కూల్ ప్రారంభం కావడంతో పని పెండింగ్‌లో పడిపోయింది. కానీ పాటిల్ ఆలోచనలో మార్పు మాత్రం రాలేదు. క్రిస్మస్ సెలవుల్లో తల్లిదండ్రులతో కలిసి ప్లాన్ చేసి 'ఐ హావ్ రీడ్ ద బుక్.కామ్'కి రూపకల్పన చేశాడు.

ఇంతవరకు బాగానే ఉన్నా.. తర్వాత రిజిస్ట్రేషన్ పొందడమే పెనుసవాల్‌గా మారింది. తనొక్కడే అన్ని పుస్తకాలకు రివ్యూ రాయడం అసాధ్యం. తనలాగే చిన్న పిల్లలే రివ్యూలు రాయాలి. పుస్తకాలు చదవాలి. తన సైట్‌లో చిన్న పిల్లలే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇవి పాటిల్‌కు మొదటగా కనిపించిన సమస్యలు. వీటన్నింటికీ ఒక్కటే పరిష్కారం ఆలోచించాడు. స్కూళ్లకు లేఖలు రాయాలని భావించాడు. వేసవి సెలవుల్లో సిద్ధం చేసుకున్న పన్నెండు వేల స్కూళ్లకు.. తన మిత్రుల సాయంతో లెటర్స్ పంపాడు. తన వెబ్‌సైట్ గురించి మొత్తం అందులో వివరించాడు. రిజిస్ట్రేషన్ చేసుకోమని అభ్యర్థించాడు. సక్సెస్ అవుతుందో లేదో అనుకున్న పాటిల్‌కు ఊహించని రెస్పాన్స్ వచ్చింది. వేల సంఖ్యలో స్కూళ్లు తమ విద్యార్థులను వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోమని ప్రోత్సహించాయి. దాంతో ఇక పాటిల్ వెనక్కి తిరిగి చూసుకోలేదు. తొలి వారంలోనే బుక్ రివ్యూలు పంపేందుకు పెద్ద సంఖ్యలో బాల రచయితలు సిద్ధమయ్యారు. వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు తమ రివ్యూలు పంపేందుకు ఓ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాడు. అలా వచ్చిన రివ్యూలను తనే క్రాస్ చెక్ చేసి పోస్ట్ చేస్తాడు.

మొదట్లో పది, పన్నెండు గంటలు పనిచేసేవాడు. రిజిస్ట్రేషన్ చూడటం, ఈ మెయిల్స్ పంపడం, సందేహాలను సమాధానాలను చెప్పడంతోనే సమయం గడిచిపోయేది. అయితే ఇప్పుడు అంతా పర్‌ఫెక్ట్‌గా నడుస్తుండడంతో మామూలు రోజుల్లో రెండు, మూడు గంటలు.. వీకెండ్స్‌లో మూడు, నాలుగు గంటలు వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేయడానికి కేటాయిస్తున్నాడు.

పాటిల్ రివ్యూలతో బిజీగా మారినా.. పుస్తకాలు చదివే అలవాటు మాత్రం మానుకోలేదు. ఏ చిన్న అవకాశం దొరికినా తను చదివిన పుస్తకానికి రివ్యూ రాసేస్తాడు. ఈ రోజుల్లో చాలా మంది పిల్లలకు చదివే అలవాటుకు దూరమవుతున్నారని.. అలాంటి వారిని మార్చే ప్రయత్నం చేస్తున్నావని చాలా మంది పెద్దవాళ్లు అర్థవ్ పాటిల్‌ను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. గత నెలలో జరిగిన ఐటీ - బి ఈ సమ్మిట్‌లో అర్థవ్ పాటిల్ టీన్ టైకూన్ అవార్డును కూడా అందుకున్నాడు.